# తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

- బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి
- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

మందమర్రి, అక్టోబర్ 13: బీఆర్ఎస్ పై ఇతర పార్టీల నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపు నిచ్చారు. మందమర్రి పట్టణంలోని రెండవ జోన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశానికి వచ్చిన విప్ సుమన్‌కు పార్టీ నాయకుల ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం సమావేశంలో విప్ సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి, పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు అందుతున్నాయా లేదా తెలుసుకోవాలని, వార్డులు, గ్రామాల్లో అభివృద్ధి పనుల వివరాలను సేకరించాలని సూచించారు. వచ్చే నెల 7న మందమర్రి మున్సిపాలిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా రానున్నట్లు ఆయన తెలిపారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలన్నారు. ఇతర పార్టీలు చెబుతున్న తప్పుడు సర్వే వివరాలను నమ్మి ప్రజలు అయోమయానికి గురికావద్దని ఆయన కోరారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని అందులో ఎలాంటి సందేహం లేదని సర్వేలన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మందమర్రి ఇన్‌చార్జి కెంగర్ల మల్లయ్య, జడ్పీటీసీ సభ్యుడు వేల్పుల రవి, వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.ప్రభాకర్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామ్మూర్తి, గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఎండీ.అబ్బాస్, మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోటపల్లిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

**బీఆర్ఎస్ కోటపల్లి మండల అధ్యక్షుడికి పరామర్శ**

కోటపల్లి, అక్టోబర్ 13 : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఎరినాగుల మల్లికార్జున్ మరణించగా అతని తండ్రి అయిన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎరినాగుల ఓదెలును ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పరామర్శించారు. కోటపల్లి మండలంలోని లింగన్నపేట గ్రామంలో శుక్రవారం మల్లికార్జున్ ద్వాదశ దినకర్మ నిర్వహించగా, విప్ సుమన్ మల్లికార్జున్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మల్లికార్జున్ చేసిన పోరాటాన్ని, ప్రజా సేవను గుర్తు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ ఎరినాగుల మల్లికార్జున్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఓదెలును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, సర్పంచ్ దాగాము రాజు, బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముల్కల్ల శశిపాల్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు మారిశెట్టి విద్యాసాగర్, మండల నాయకులు, కార్యకర్తలున్నారు.

**బీఆర్ఎస్‌కు కార్యకర్తలే అండ**

భారత రాష్ట్ర సమితికి కార్యకర్తలే కొండంత అండ అని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. కోటపల్లి మండలకేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ కోటపల్లి మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల సమావేశాన్ని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పిలుపు మేరకు అనేక ఉద్యమాలను చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణ చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం రూపురేఖలు మారి దేశానికి అన్నపూర్ణగా మారిందన్నారు. అలాంటి దమ్మున్న నాయకున్ని హ్యాట్రిక్ సీఎం ను చేయాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వందకు పైగా సీట్లను గెలిపించి కేసీఆర్‌కు అప్పగించాలన్నారు. బాల్క సుమన్ చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో చెన్నూర్ అభివృద్ధిలో నంబర్ వన్‌గా దూసుకుపోతుందన్నారని, అలాంటి నాయకుడిని మళ్లీ ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బైస ప్రభాకర్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ గుర్రం రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముల్కల్ల శశిపాల్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మందమర్రి : హాజరైన నాయకులు, కార్యకర్తలు

# అభివృద్ధి, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 13: తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని రెడ్డికాలనీలో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. వీటన్నింటిపై ప్రతి ఓటరుకూ వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి అందరూ కృషిచేయాలని కోరారు. మంచిర్యాలను మంచి మంచిర్యాలగా ఉంచాలన్నదే తన ఆలోచన అని, ఇతరుల చేతికి పోతే ఆగంచేస్తారని, ఈ విషయాన్ని అందరూ గమనించాలన్నారు. భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, పత్తాలాట క్లబ్‌లు, గుండాయిజం, రౌడీయిజం చేసే వ్యక్తులను ప్రజలు ఛీ కొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఎళ్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వాళ్ల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నామని, ఇలాంటి పార్టీని, నాయకులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని, మనం చేసిన పనులను, చేయబోయే పనులను, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, విజయాలను ప్రజలకు అర్థమయ్యేరీతిలో వివరించినపుడే వారు మన వైపునకు మొగ్గుచూపుతారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని, ప్రజలు కూడా వారి మాటలను విశ్వసించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ సురేశ్‌బల్దవా, మాజీ కౌన్సిలర్లు కర్కూరి చంద్రమౌళి, చంద్రశేఖర్ హండే, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, ఖాజామియా, కృష్ణ, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

వాంకిడి, అక్టోబర్13 : అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని, సీఎం కేసీఆర్ పాలనకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని జడ్పీ చైర్‌పర్సన్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం వాంకిడి మండలంలోని తేజాపూర్, తేజిగూడ, జైత్‌పూర్, సామెల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల ఆమె మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన ఘనత మన సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. ఇచ్చిన, ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఏకైక సర్కారు మాదేనని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం సాధించిన ప్రగతిని ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సెండె రాజ్‌కుమార్, సర్పంచ్ మారుతి, నాయకులు దీపక్ ముండే, సదాశివ్ పాల్గొన్నారు.

# ప్రచారంలో సత్తాచాటాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- బీఆర్ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం



బెజ్జూర్ : బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, అక్టోబర్ 13: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సోషల్ మీడియాలో ప్రచారం చేసి సత్తాచాటాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు క్రిషాంక్, దినేశ్ చౌదరి మాట్లాడుతూ సోషల్ మీడియా సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, నియోజకవర్గంలోని సోషల్ మీడియా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో 30 మంది చేరిక**

బెజ్జూర్, అక్టోబర్ 13 : మండలంలోని పాపన్‌పేట గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు 30 మంది శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ డోకె వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# ఉదయం కాంగ్రెస్‌లో.. రాత్రి తిరిగి బీఆర్ఎస్‌లోకి..

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 13: మంచిర్యాల పట్టణం పాతమంచిర్యాలకు చెందిన రైతు బంధు సమితి మండల కన్వీనర్ తూముల వెంకటరామయ్య ఉదయం పూట కాంగ్రెస్ పార్టీలో చేరి, రాత్రి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంటరాజయ్యకు అత్యంత సన్నిహితుడైన వెంకటరామయ్యను కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాయ మాటలు చెప్పి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే తనయుడు విజిత్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య వెంకటరామయ్యతో చర్చించారు. తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానించడంతో అందుకు ఆయన ఒప్పుకున్నారు.



పార్టీ కండువాకప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న విజిత్‌రావు